క్లుప్తంగా

దూబచర్లలో నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

నల్లజర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల శాఖ, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దూబచర్ల గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు దాదాపు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 10 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం అవుతాయని నిర్ధారించారు. మరికొంత మందికి కళ్ల జోళ్లు అమర్చారు. ఆపరేషన్లు అవసరమని నిర్ధారించిన వారిని వేమగిరి ఆసుపత్రికి తరలించారు. శిబిరాన్ని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ షరీఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో అంబటి వెంకట శ్రీనివాసరావు, చీమకుర్తి కృష్ణప్రసాద్, సోమిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

75 మందికి సుగర్ పరీక్షలు

నిడదవోలు: స్థానిక లింగంపల్లిలోని రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 75 మందికి ఉచితంగా సుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్, బూరుగుపల్లి సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బీఎస్వీ ప్రసాద్, సుంకర త్రిమూర్తులు పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

నిడదవోలు: ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సెంటర్లోని ప్రయాణికులకు, రిక్షా కార్మికులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, అడ్డాల పెద దుర్గారావు, గొన్నాబత్తుల రామారావు, పొన్న సుబ్రహ్మణ్యం, గోపిరెడ్డి శ్రీనివాస్, పోలదాసు శ్రీనివాస్, కొత్తపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఆంజనేయ స్వామి ఊరేగింపు

ఉండ్రాజవరం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని వెలగదుర్రులో క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీభక్తాంజనేయ స్వామి వారిని ఆదివారం వాయిద్యాలతో పల్లకీలో గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పాలంగి, వేలివెన్ను గ్రామాల్లో ఆంజనేయ స్వామి వార్లతో పాటు ఉండ్రాజవరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలు నిర్వహించారు.

ముందస్తు సాగుకు రైట్ .. రైట్

- ఎండలు తగ్గి, అడపాదడపా వర్షాలు
- ఒకటి, రెండు రోజుల్లో నైరుతి రాక
- ఇప్పటికే గోదావరి నుంచి కాలువలకు నీటి విడుదల
- ఖరీఫ్ సాగుకు అనుకూల వాతావరణం
- ఉత్సాహంగా పొలం బాట పట్టిన రైతులు
- నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో సాగు



పెరవలి మండలం ఉసులుమర్రులో ఆకుమడిని చదును చేస్తున్న దృశ్యం



ఉసులుమర్రులో ఆకుమడిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

పెరవలి: నవంబర్, డిసెంబర్ నెలల్లో వచ్చే తుపానుల నుంచి ఖరీఫ్ వరి పంటను కాపాడుకునేందుకు ముందస్తు సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు ఏటా రైతులకు సూచిస్తుంటారు. అధికారుల సలహా మేరకు అన్నదాతలు ముందస్తు సాగుకు ఉపక్రమించినంత మాత్రాన ఆశించిన ఫలితం దక్కదు. అందుకు వాతావరణం కూడా అనుకూలించాలి. ఇప్పుడు రోహిణీ కార్తె నడుస్తోంది. అంటే రోళ్లు పగిలే ఎండలకు ప్రసిద్ధి. అయితే చిత్రంగా అందుకు భిన్నంగా ఎండలు తగ్గి, అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కూడా మన ప్రాంతాన్ని తాకనున్నాయి. అదే సమయంలో ఖరీఫ్ అవసరాల కోసం అధికారులు గోదావరి నది నుంచి కాలువలకు నీటిని కూడా విడుదల చేశారు. అంటే ముందస్తు ఖరీఫ్ సాగుకు పూర్తి అనుకూలమైన వాతావరణం ఈ ఏడాది స్పష్టంగా కనిపిస్తోంది. ఒక విధంగా అరక పట్టి పొలం బాట పట్టిన అన్నదాతకు ఇది శుభ సూచకమే. నీటిపారుదల శాఖ అధికారులు జూన్ 1న కాలువలకు నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువలకు నీరు వచ్చినా చిన్న, పిల్ల కాలువలకు నీరు రావడానికి మరో మూడు రోజుల సమయం పడుతుంది. ఆ ఉద్దేశంతో రైతులు తమ పొలాలను దుక్కి దున్ని ముందస్తు సాగుకు సన్నద్ధం చేసుకుంటున్నారు. పంట చేలకు నీరు వచ్చిన వెంటనే దమ్ములు చేసి ఆకుమడులు వేస్తారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్‌లో వరి సాగవుతుంది. ఇందులో మండలాల వారీగా నిడదవోలులో 16,500, ఉండ్రాజవరంలో 11,500, పెరవలిలో 8,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. బోర్ల సదుపాయం ఉన్న రైతులు ఇప్పటికే కొంత మేర ఆకుమడులు పోశారు. విత్తన సాగు చేసే రైతులు కూడా చేలను దమ్ము చేసి రెండు, మూడు రోజుల్లో కాలువ నీరు రాగానే ఆకుమడులు వేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నవంబర్, డిసెంబర్ నెలల్లో పంటలు పాడైపోతున్నందున జూలైలోనే వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సలహా ఇస్తుంటారు. ఇలా ముందస్తు సాగు చేయడం వల్ల అక్టోబర్‌లోనే ఖరీఫ్ పంట కోతకు వచ్చి, ధాన్యం ఒబ్బిడి అయితే, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

సాగు చేసే వంగడాలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు స్వర్ణ, పిల్ రకాలతో పాటు పీఎల్‌ఏ -1100, ఎంటీయూ -1064, ఎంటీయూ -1061, ఎంటీయూ -1229 అనే వరి వంగడాల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరికొందరు రైతులు సన్న రకాల సాగుకు ఇష్టపడుతున్నారు. పెరవలి మండలంలోని ఉసులుమర్రు, తీపర్రు, కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల రైతులు విత్తన సాగు చేస్తారు. మిగిలిన గ్రామాల్లో యథాస్థితిగా వరి సాగు చేస్తారు. దీనిపై మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ మాట్లాడుతూ ఏటా ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల పంటలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడి దెబ్బతింటున్నాయన్నారు. అందుకే వ్యవసాయ శాఖ గ్రామ గ్రామానా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి, వారిని ముందస్తు సాగుకు సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. మండలంలోని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సొసైటీలతో పాటు డీసీఎంఎస్‌లో సిద్ధంగా ఉన్నాయని ఆమె చెప్పారు.

సకాలంలో కాలువలకు నీరు



ఖరీఫ్ సాగుకు జూన్1న కాలువలకు నీటిని వదలడంతో రైతులందరం చేలను దుక్కుదున్ని సిద్ధం చేశాం. నీరు రావడానికి మరికొద్ది రోజుల పడుతుంది. అందుకే బోర్లపై ఆకుమడుల దుమ్ము చేసి విత్తనాలు వేస్తున్నాం.

– పువ్వుల శ్రీనివాస్, రైతు, కాపవరం

వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రత్యేక పూజలు



కోటసత్తెమ్మ గుడిలో పూజలు చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు

నిడదవోలు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని ప్రార్థిస్తూ తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారికి శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నిడదవోలు ఎమ్మెల్యేగా జి. శ్రీనివాస్‌నాయుడు మళ్లీ భారీ మెజార్టీలతో గెలుపొందేలా ఆశీర్వదించాలని కోరుతూ అమ్మవారిని మొక్కుకున్నట్టు రామారావు తెలిపారు. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రైతులకు చేసిన మేలు వల్ల వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

ప్రీమియర్ లీగ్ విజేత రాజా వారియర్స్

ప్రకాశంనగర్: మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో రాజా వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. 40 రోజులుగా స్థానిక మున్సిపల్ మైదానంలో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌ల్లో రాజా వారియర్స్, వాంబే సూపర్ కింగ్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. విజేతగా నిలిచిన రాజా వారియర్స్‌కు వైఎస్సార్ సీపీ నాయకుడు టీకే విశ్వేశ్వర రెడ్డి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 42 వార్డు ఇన్‌చార్జి నామాన వాసు, బూసి వజ్రనాథ్, రఫీ, ఉమా, కోట, ఎండీ వజీర్, పురుషోత్తం, నాగార్జున, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం మెయిన్ రోడ్డులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సుమారు 300 మందికి ఉచిత కంటి, దంత, గుండె, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్టు తెలిపారు. వంద మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయన్నారు. వారిని ఆదివారం అందజేస్తామన్నారు. 30 మందికి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. శిబిరానికి చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని జట్టుకూలీలు, షాపుల్లో పని చేసే సిబ్బంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, నందెపు శ్రీనివాస్, కోశాధికారి బలభద్ర వెంకట్రాజు, ట్రస్టుబోర్డు కార్యదర్శి శ్రీకనకాల రాజా, కార్యవర్గ సభ్యులు యక్కల నాగేశ్వరరావు, వలవల దుర్గాప్రసాద్(చిన్ని), వివిధ సంఘాల ప్రతినిధులు, జట్లు లేబర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సింగవరం ముత్యాలమ్మ జాతర



సింగవరంలో ముత్యాలమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తదితరులు

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం గ్రామదేవత ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రామ నడివీధి పూరిపాకలో కొలువైన ముత్యాలమ్మను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు దర్శించుకున్నారు. భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. జాతరకు వచ్చిన గ్రామ ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళలాడింది. పట్టణ ఎస్సై పి.అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ వేడుకలో వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు,ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, సుంకవల్లి శ్రీహరి, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న అవంతీ ఫీడ్స్ ఈడీ అల్లూరి వెంకట సందీప్

కొవ్వూరు: స్థానిక గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సౌజన్యంతో పట్టణంలో నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో మే 1న ప్రారంభమైన ఈ శిక్షణ నెల రోజుల పాటు కొనసాగింది. సీనియర్స్ విభాగంలో 30 మంది రెసిడెన్షియల్ గాను, పది మంది క్రీడాకారులు డే స్కాలర్స్ గాను శిక్షణకు హాజరయ్యారు. ఇక జూనియర్స్ విభాగంలో నలభై మంది డే స్కాలర్స్‌గా శిక్షణ పొందారని క్యాంపు ఇన్‌చార్జ్ కొయ్యల ప్రసాద్ తెలిపారు. అవంతీ ఫీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి వెంకట సందీప్, గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్, కార్యదర్శి సూరపనేని చిన్ని, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు, అభ్యాస స్కూల్ ప్రిన్సిపల్ పాలడుగుల రఘురామ్ చేతుల మీదుగా శిక్షణ పొందిన విద్యార్థులకు క్రీడాదుస్తులు, బూట్లు, సర్టిఫికెట్లు అందజేశారు.

డివిజన్‌లో పోలీసు పికెట్ల ఏర్పాటు

- శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు
- డీఎస్పీ కేసీహెచ్ రామారావు హెచ్చరిక

కొవ్వూరు: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో కొవ్వూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ సీహెచ్ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద గానీ, పార్టీ కార్యాలయాల వద్ద గానీ, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా గ్రామాల్లో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. బాణసంచా కాల్చడం, డీజేల ఏర్పాటు, లౌడు స్పీకర్లు ఏర్పాటు చేయడం వంటివి నిషేధమని డీఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లో ఏవైనా గొడవలు జరుగుతున్నా, ఎవరైనా చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జూద క్రీడలు, కోడి పందేలను నివారించమని నిడదవోలు, కొవ్వూరు రూరల్, దేవరపల్లి సీఐలకు రాతపూర్వక ఆదేశాలు ఇచ్చామని డీఎస్పీ రామారావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. నిడదవోలు మండలం సింగవరంలో కోడిపందేలు, పేకాటలను నియంత్రించడంలో ఇటీవల స్థానిక ఎస్సై సరిగా స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవరపల్లి ఎస్సైకి, నిడదవోలులో కొత్తగా చార్జి తీసుకున్న సీఐకి బాధ్యతలు అప్పగించామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో పోలీసు స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఎస్సైలను హెచ్చరించినట్టు డీఎస్పీ ప్రకటించారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

- రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ
- కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ

నిడదవోలు: రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో ఈనెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అందరూ సహకరించాలని రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ బి.ఆదినారాయణ కోరారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏజెంట్లతో ఆదివారం రాత్రి పట్టణంలోని సీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఏజెంట్లు అందరూ తమకు నిర్దేశించిన సమయానికి ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలని, కౌంటింగ్ హాల్లోకి సెల్ ఫోన్లు, పెన్నులకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియపై ఏజెంట్లకు ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. గొడవలు చేయడం, గట్టిగా అరవడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కౌంటింగ్ హాలులోకి వచ్చిన తర్వాత లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు అక్కడే ఉండాలన్నారు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అనంతరం ఉదయం 8.30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఏజెంట్లు ఎవరూ కూడా మద్యం సేవించి కౌంటింగ్ కేంద్రానికి రాకూడదని ఆయన హెచ్చరించారు. పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిడదవోలు సీఐ వి. జానకిరామయ్య, పట్టణ ఎస్సై పులపా అప్పారావు, సమిశ్రగూడెం, ఉండ్రాజవరం, పెరవలి ఎస్సైలు రమేష్ , అప్పలరాజు, మూర్తి, సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

శాంతించిన భానుడు .. పలకరించిన వరుణుడు

- రుతు పవనాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు
- నారుమడి పనుల్లో అన్నదాతలు



బోరు నీటితో వేసిన ఆకుమడి

నల్లజర్ల: నైరుతి రుతు పవనాల ప్రభావంతో వాతావరణం కొంతమేర చల్లబడింది. శనివారం రాత్రి నుంచి అక్కడక్కడా చిరుజల్లులు పడుతున్నాయి. రుతు పవనాల ప్రభావంతో మేఘాలు చురుగ్గా కదలడంతో మండలంలో మరింతగా వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో కొద్ది రోజులుగా గుర్రై ఇబ్బందులు పడిన జనం ఇప్పుడు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోపక్క ఖరీఫ్ వ్యవసాయ పనులు క్రమంగా మొదలవుతున్నాయి. బోర్ల వద్ద ఇప్పటికే రైతులు ఆకుమడులు పోశారు. ఈ ఏడాది నల్లజర్ల మండలంలో 8,264 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు జరుగుతుంది. దీనికోసం 413 ఎకరాల విస్తీర్ణంలో వరినారు పోయాల్సి ఉంది. శనివారం నుంచి నారుమడులు వేసే కార్యక్రమం జోరందుకుంది.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

మండలంలో కౌలు రైతులందరికీ (సాగుదారు హక్కు పత్రాలు) గుర్తింపు కార్డులు అందజేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి(ఏవో) కె.కమల్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ గుర్తింపు కార్డులతో అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి కౌలు రైతు ఆధార్, భూయజమాని ఆధార్, 1-బీ అడంగల్, అంగీకార పత్రాన్ని సంబంధిత వీఆర్వోకు అందజేసి గుర్తింపు కార్డు పొందాలని ఏవో సూచించారు. ఈ గుర్తింపు కార్డుల వలన రైతు భరోసా సాయం, ఈ-క్రాప్ బుకింగ్, పంటలబీమా ,ధాన్యం కొనుగోలు, బ్యాంకు రుణాలు, విత్తనాల రిజిస్ట్రేషన్ తదితర ప్రయోజనాలు ఉంటాయన్నారు.



గోదావరి నదిలో స్నానాలు చేస్తూ సేద తీరుతున్న యువత

ఈత కొడుతూ.. సేద తీరుతూ

తాళ్లపూడి: ఎండ వేడి తగ్గినా ఆదివారం ఉన్నపోత ప్రజలను బాగా వేధించింది. దాంతో కాలువల్లోనూ, సమీప గోదావరి నదిలోనూ స్నానాలు చేస్తూ, ఈత కొడుతూ చిన్నాపెద్దా కాలక్షేపం చేశారు. ఉక్కపోత నుంచి బయట పడడానికి జనం నానా పాట్లు పడుతున్నారు. మండలంలోని గోదావరి రేవుల్లో పెద్ద సంఖ్యలో ఉదయం పూట, సాయంత్రం వేళ, జలకాలాడేందుకు యువకులు, విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గంటల తరబడి జలాశయాల్లోనే ఉంటున్నారు. ఈత రాని వారికి తల్లిదండ్రులు దగ్గరుండి మరీ ఈత నేర్పిస్తున్నారు. గోదావరిలో లోతు ఎక్కువగా ఉంటుంది కాబట్టి, జాగ్రతగా ఉండాలని తాళ్లపూడి పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి గోదావరి నది లోతు తెలియదని జాగ్రతగా ఉండాలని సూచిస్తున్నారు.



వేగేశ్వరపురం వద్ద గోదావరిలో స్నానాలు చేస్తున్న స్థానికులు

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



నిడదవోలులో విద్యార్థులకు అమరవీరుల చరిత్ర వివరిస్తున్న రిటైర్డ్ మాస్టర్ వెంకటరమణ



ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థినీవిద్యార్థుల నృత్య సాధన

నిడదవోలు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను రిటైర్డ్ హిందీ మాస్టర్ సీహెచ్ వెంకటరమణ విద్యార్థులకు వివరించారు. మహనీయుల చరిత్రను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఇంగ్లిష్ గ్రామర్, వివిధ జంతువుల పేర్లు, దేశాలు వాటి రాజధానులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచె చినబాబు, పొన్న సుబ్రహ్మణ్యం, ప్రభాకరం పాల్గొన్నారు

ఇంగ్లిషుపై పట్టు సాధించాలి

పెరవలి: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మండలంలోని ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిషు, యోగా, డ్యాన్సుపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచీ ఇంగ్లిషుపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఏకాగ్రత పెరగాలంటే తప్పనిసరిగా యోగా సాధన చేయాలని యోగా మాస్టారు కరుటూరి విశ్వనాథం తెలిపారు. ఇందుకోసం విద్యార్థుల ప్రత్యేక సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. విద్యార్థులతో పలు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యు. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.